కళాసాగర్ యల్లపు

# సోషల్ మీడియా - తెలుగు సాహిత్యం

ప్రపంచంలో అతివేగంగా విస్తరిస్తున్న రంగం ఏదైనా ఉంది అంటే అది సాంకేతిక రంగం అని చెప్పవచ్చు. గ్రామీణస్థాయి నుంచి మొదలుకుని దేశంలో ఏమూలన ఉన్న విషయాన్నైనా అరక్షణంలో తెలుసుకునేంత వీలుగా నేడు అంతర్జాలం అల్లుకు పోయింది. ఒకప్పుడు పుస్తకాల్లో, పత్రికల్లో చదువుకునే సాహిత్యాన్ని కూడా నేడు సోషల్ మీడియా వేదికగా చదువుకుంటున్నాం. ప్రస్తుతం స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు.. ప్రపంచాన్ని చుట్టి రావచ్చు. నేటి కాలంలో ఇంటర్నెట్ వాడనివారు ఉండరంటే అతిశయోక్తి కాదు. చిన్న పిల్లల నుంచి మొదలుకొని వృద్ధుల వరకు అన్ని వయసుల వారు నేడు నెట్‌ను వినియోగిస్తున్నారు.

నేడు సోషల్ మీడియాలో తెలుగు సాహిత్యం విరివిగా చదువుకుంటున్నాం అంటే... అందుకు కారణం యూనికోడ్ ఫాంట్స్ అందుబాటులోకి రావడమే. కంప్యూటర్‌కు సంబంధించిన 'లిపి ప్రామాణికత'ను యూనికోడ్ అంటారు. కొన్ని నిర్దేశిత సంకేతాలు ఆధారంగా ప్రపంచ భాషలన్నింటిలోనూ అక్షరాలు కంప్యూటర్ తెరపైకి వస్తాయి. ఈ యూనికోడ్ ఫాంట్స్ 2006 సం॥లో కేంద్ర ప్రభుత్వం తెలుగు సాఫ్ట్‌వేర్ ఉపకరణాల సి.డి. విడుదల చేయడం ద్వారా వాడకంలోకి వచ్చాయి. ఆ తర్వాత 2011 సం॥ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పూనికతో 18 రకాల తెలుగు ఉచిత ఫాంట్లు అందుబాటులోకి వచ్చాకే కంప్యూటర్లలో యూనికోడ్ ఫాంట్ల వాడకం ఊపందుకుంది అని చెప్పవచ్చు.

రెండు దశాబ్దాల క్రితం వరకూ విజ్ఞానానికి, వినోదానికే కాకుండా కాలక్షేపానికీ కూడా పుస్తకాలు, పత్రికలదే హవా. ఆ తర్వాత సినిమాలు... ఎలక్ట్రానిక్ మీడియా వచ్చాక వాటి స్థానాన్ని టీవీలు, కంప్యూటర్లు ఆక్రమించాయి. శాస్త్ర సాంకేతిక రంగాల్లో వచ్చిన విప్లవం వల్ల అరచేతిలో ఇమిడిపోయే స్మార్ట్ ఫోన్ ఆవిష్కరణతో డిజిటల్ మీడియా ఊపందుకుంది. నేడు విజ్ఞానమైనా, వినోదమైనా, చదువైనా అంతా స్మార్ట్ ఫోన్‌లోనే. కోవిడ్-19 తర్వాత ఇది మరింత విస్తృతమయ్యింది.

సోషల్ మీడియాలో సాహిత్యం ప్రధానంగా నాలుగు రూపాల్లో లభిస్తుంది. అవి... 1. వెబ్ పత్రికలు, 2. ఫేస్‌బుక్/వికీపీడియా 3. యూట్యూబ్, 4. వాట్సయాప్/టెలిగ్రామ్

## వెబ్ పత్రికలు

**ఈమాట.కామ్**(Eemaata.com):సాహిత్య మంటే అభిరుచి ఉన్నవారు, ప్రవాసంలో ఉన్న తెలుగు వారికోసం ఒక సాహిత్య పత్రికను తీర్చిదిద్దాలన్న ధ్యేయంగా 1998లో స్థాపించబడ్డ పత్రిక ఈమాట.కామ్. ఇందులో కథలు, కవితలు, పద్య సాహిత్యం, వ్యాసాలు, సమీక్షలు, ముఖాముఖీలు, శబ్దతరంగాలు, స్వగతం లాంటి అనేక శీర్షికలు ఉన్నాయి. నెల-నెలా వెలువడే ఈమాట పత్రికను కొలిచాల సురేష్ బృందం నిర్వహిస్తుంది. రెండు దశాబ్దాలకు పైగా పాఠకులను అలరిస్తున్న ఈ అంతర్జాల పత్రికకు తెలుగులో లబ్ధప్రతిష్ఠులైన రచయితలందరూ రచనలు చేస్తున్నారు.

**తెలుగువన్.కామ్** (Teluguone.com) : తెలుగు వెబ్ పత్రికలకు నాంది పలికింది తెలుగువన్.కామ్. కంఠంనేని రవిశంకర్ సారథ్యంలో కామెడీ రచయిత, కార్టూనిస్ట్ మల్లిక్ సంపాదకీయంలో 2001లో ప్రవాసాంధ్రుల కోసం ప్రారంభించబడింది. ఇందులో సాహిత్యం, వినోదం, కార్టూన్లు, జోక్స్ ఉంటాయి. ప్రస్తుతం షార్ట్ ఫిలింలు కూడా అందుబాటులో వున్నాయి. తొలుత ఈ వెబ్ పత్రికలో కొన్ని ఫీచర్స్ చందాదారులకు మాత్రమే అందుబాటులో ఉండేవి.

**కౌముది.నెట్** (Koumudi.net) : సాహితీవేత్త, ప్రవాసాంధ్రుడు కిరణ్ ప్రభ సంపాదకత్వంలో 2007 సం॥ జనవరిలో ప్రారంభించ బడ్డ కౌముది.నెట్ మాసపత్రికలో నెల-నెలా కథలు, కవితా కౌముది, ధారావాహిక నవలలు, ప్రముఖుల వ్యాసాలు, ఆత్మకథలు, పుస్తక సమీక్షలు, కార్టూన్లు, సినీ కౌముది, హాస్య కౌముది ఉంటాయి. ఇందులో మల్లాది, యండమూరి, గొల్లపూడి మారుతీరావు లాంటి లబ్ధప్రతిష్ఠులైన రచయితల రచనలు చదువుకోవచ్చు. ప్రారంభం నుండి పాత సంచికలు వెబ్‌సైట్‌లో అందుబాటులో వున్నాయి. ఈ పత్రికకు సహ సంపాదకురాలిగా కాంతి కిరణ్ ఉన్నారు. పి.డి.ఎఫ్. ఫార్మేట్‌లో తెస్తున్న ఈ పత్రికను యూనీకోడ్‌లోకి మారిస్తే మరింత ప్రయోజనకరంగా వుంటుంది.

**64కళలు.కామ్** (64kalalu.com) సకల కళల సమాహారం: చిత్రకారుడు, రచయిత కళాసాగర్ యల్లపు వ్యవస్థాపక సంపాదకుడిగా 2010 సం॥లో మాసపత్రికగా ప్రారంభించబడి, 2017 నుండి వారపత్రికగా వెలువడుతుంది. కళల కోసం, కళాకారుల కోసం వెలువడిన తొలి తెలుగు వెబ్ పత్రిక 64కళలు.కామ్. తెలుగు సంస్కృతి కళావైభవాన్ని విశ్వవ్యాప్తం చేయడానికి కృషిచేస్తున్న ఈ పత్రిక పుష్కరకాలం పూర్తిచేసుకుంది. వెంటపల్లి సత్యనారాయణ, సుంకర చలపతిరావు, మాకినీడి సూర్యభాస్కర్, బి.ఎ. రెడ్డి, ఎల్.ఆర్. వెంకట రమణలు చిత్రకళ గురించి, డా॥ జయదేవ్ కార్టూన్ గురించి, వాడ్రేవు సుందరరావు, మన్నె శ్రీనివాసరావు, అడవి శంకరరావులు నాటకరంగం గురించి, ఆచారం షణ్ముఖాచారి సిని మాల గురించి, ఇంకా బి.యం.పి. సింగ్, డా॥ కె. మృత్యుంజయ రావు, ఎస్.వి.వి.యస్. లక్ష్మి, బ్నిం, పింగళి భాగ్యలక్ష్మి, ఆత్మ కూరి రామకృష్ణ, మందరపు హైమావతి తదితరులు రాస్తున్న శీర్షికలతో, కళ-సాహిత్య సంబంధిత సమాచారంతో వారం-వారం అలరిస్తుంది.

**అచ్చంగా తెలుగు** (AchamgaTelugu.com): అంతర్జాల మాసపత్రిక: రచయిత్రి భావరాజు పద్మిని సంపాదకత్వంలో 2012 నుండి వెలువడుతున్న మాసపత్రిక అచ్చంగా తెలుగు. ఇందులో ధారావాహికలు, కథలు, కళావేదిక, ముఖాముఖీలతో పాటు ఇంకా అనేక శీర్షికలున్నాయి.

**సారంగ**-సాహిత్య పక్షపత్రిక (Magazine.saarangabooks.com) : సారంగ మొదట సాహిత్య వారపత్రికగా 2013 సం॥లో ప్రారంభించారు. 2018 నుండి సాహిత్య పక్షపత్రికగా వెలువడుతుంది. ఇందులో కథలు, కవితలు, కాలమ్స్ ఉంటాయి. ప్రముఖ కవి, ప్రవాసాంధ్రుడు అఫ్సర్ దీనికి సారధ్యం వహిస్తున్నారు.

**గోతెలుగు.కామ్** (Gotelugu.com): సాహితీ ప్రియుడు, కార్టూనిస్ట్ పొలిచర్ల శ్రీనివాస్(బన్ను) నిర్వహణలో 2015 సం॥లో ప్రారంభించబడ్డ గోతెలుగు.కామ్ మాసపత్రికలో కథలు, కవితలు, నవలలు, వ్యాసాలు, సమీక్షలు, కార్టూన్లతో పాటు వీడియోలు లభిస్తాయి. పాత సంచికలూ అందుబాటులో ఉంటాయి.

**నెచ్చెలి.కామ్**(Neccheli.com)అంతర్జాల వనితా మాసపత్రిక: అమెరికా సంయుక్త రాష్ట్రాల నుండి వెలువడుతున్న తొలి తెలుగు అంతర్జాల వనితా మాసపత్రికను ప్రముఖ కవయిత్రి డా. కె. గీత సంపాదకురాలిగా 2019 సం॥లో ప్రారంభించారు. ఈ పత్రిక అంతర్జాతీయ స్థాయిలో స్త్రీలకు సంబంధించిన సాహిత్యం, సంగీతం, కవితలు, కథలు, సమీక్షలు, ఇంటర్వ్యూలు, పరిశోధనలు మొదలగు అనేక అంశాలను పరిచయం చేస్తుంది.

**విహంగ** (Vihanga.com) మహిళా సాహిత్య పత్రిక: తొలి తెలుగు మహిళా వెబ్ పత్రికగా 2011 సం॥ నుండి మానస ఎండ్లూరి, డా. అరసిశ్రీ నేతృత్వంలో వెలువడుతుంది. పత్రిక వ్యవస్థాపకులు పుట్ల హేమలత. ఇందులో కథలు, కవితలు, ధారా వాహికలు, వ్యాసాలు, కాలమ్స్, ముఖాముఖీలు, సాహిత్య సమావేశాలు లాంటి శీర్షికలుంటాయి.

**సహరి సమగ్ర వారపత్రిక** (Sahari.in): 2020 సం॥లో ప్రారంభమైన సహరి సమగ్ర వారపత్రిక యువతకోసం, ఆధ్యాత్మికం, కథలు, సీరియల్స్ అందిస్తుంది. గొర్తి శ్రీనివాసరావు, పసుపులేటి సత్య శ్రీనివాస్‌గార్ల సారధ్యంలో నడుస్తుందీపత్రిక.

**మాలిక.ఆర్గ్** (Maalika.org) సాహిత్య మాస పత్రిక: రచయిత్రి, పబ్లిషర్ జ్యోతి వలబోజు ప్రధాన సంపాదకురాలిగా ఆవిష్కరించిన మాలిక సాహిత్య మాసపత్రికలో కథలు, యాత్రామాలిక, ధారావాహికలు, వ్యాసాలు, కవితలు, కార్టూన్స్ ఉంటాయి.

**నిత్య ఇ-మాసపత్రిక** (Nithyamonthly.com): పాఠకులకు నాణ్యమైన మంచి రచనలు అందించే లక్ష్యంతో 2020లో ప్రారంభించిన పత్రిక నిత్య ఇ-మాసపత్రిక. కథలు, కవితలు ప్రత్యేక శీర్షికలతో పాటు ప్రతీ నెలా ఒక పూర్తి నవలను అందించడం నిత్య ప్రత్యేకత. ప్రముఖ రచయిత, జర్నలిస్ట్ బెందాళం కృష్ణారావు నిత్య పత్రిక రూపకల్పనలో కీలకపాత్ర పోషిస్తున్నారు. డా॥ ఈమని శివనాగి రెడ్డి, నాగసూరి వేణుగోపాల్, దీర్ఘాసి విజయభాస్కర్, బి.యస్. రాములు తదితరుల రచనలు నిత్య పత్రికలో చదువుకోవచ్చు.

**మధురవాణి.కామ్** (Madhuravani.com): 2016 సం॥లో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు సాహిత్యాభిమానులకు ఒక చిరుకానుకగా మధురవాణి.కామ్ పత్రికను శ్రీనివాస్ పెండ్యాల నిర్వహిస్తున్నారు. ఈ పత్రికలో కథలు, కవితలు, వ్యాసాలు, ఆధ్యాత్మికం, సాహితీ సౌరభాలు, పుస్తక పరిచయాలు, అలనాటి మధురాలు, వ్యంగ్య రచనలు ఉంటాయి. ఈ అంతర్జాల పత్రిక 'మధురవాణి' ఏడాదికి నాలుగు సార్లు జనవరి, ఏప్రియల్, జూలై, అక్టోబర్ నెలల్లో వెలువడుతుంది. ఈ పత్రిక ప్రత్యేకత ఏమిటంటే తెలుగు-ఇంగ్లీషు భాషల్లో చదువుకోవచ్చు.

**మయూఖ** (Mayuukhathemagazine.com) : సాహిత్యం పంచే విజ్ఞాన వెలుగుల కిరణాలు పాఠకులకు చేర్చే లక్ష్యంతో ప్రారంభించబడిన మయూఖ ద్వైమాసిక అంతర్జాల సాహిత్య పత్రికలో కథలు, కవితలు, ధారావాహికలు, వ్యాసాలు, బాలసాహిత్యం, ఇంటర్వ్యూలు, పుస్తక సమీక్షలతో పాటు అనువాద సాహిత్యం లభిస్తుంది. నేటి యువ రచయితలకు ఉపయోగపడే సాహిత్య విమర్శ వ్యాసాలను కూడా ప్రచురిస్తుంది. ఈ పత్రికకు సంపాదకురాలిగా డా॥ కొండపల్లి నీహారిణి వ్యవహరిస్తున్నారు. సలహా మండలిలో డా॥ కె.వి. రమణాచారి, కొండపల్లి వేణుగోపాల రావులున్నారు.

**పొద్దు అంతర్జాల పత్రిక** (Poddu.net): వ్యక్తుల ప్రతిభా వేదికే పొద్దు అంతర్జాల పత్రికగా 2011 సం॥లో అవతరించింది. తుమ్మల శిరీష్ కుమార్ మరో నలుగురు కలిసి ఉమ్మడిగా సారధ్యం వహిస్తున్న పొద్దులో వారం-వారం కథలు, కవితలు, సమీక్షలు, కబుర్లతో పాటు ఎన్నో శీర్షికలున్నాయి. ఆలోచనలున్న ప్రతీవారూ రాయాలని, ఇతరుల ఆలోచనలు ఏమిటో తెలుసు కోవటానికి చదవాలన్న నినాదంతో ఈ పత్రిక నడుస్తుంది.

**సంచిక తెలుగు సాహిత్య వేదిక** (Sanchika.com): 2018 సం॥లో ప్రారంభమైన సంచిక తెలుగు సాహిత్య వేదిక కథలు, కవితలు, ధారావాహికలు, వ్యాసాలు, సినిమాలు, పుస్తకాల సమీక్షలు ప్రచురిస్తుంది.

**తానా పత్రిక** (Tana.org) : తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా ఆధ్వర్యంలో సాయి బ్రహ్మానందం గొర్తి సంపాదకుడిగా, నవీన్ వాసిరెడ్డి సహ సంపాదకుడిగా కృషిచేస్తున్న తానా మాసపత్రికలో సమకాలీన సాహిత్య, సాంస్కృతిక, సామాజిక అంశాలతో పాటు కథలు, ప్రత్యేక కథనాలు, తానా ఫౌండేషన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల గురించి ప్రచురిస్తారు.

**తెలుగుతల్లి కెనడా పత్రిక** (Telugutalli.ca) : కెనడాలో వున్న ప్రవాసాంధ్రులు 2017 సం॥లో ప్రారంభించిన మాసపత్రిక తెలుగుతల్లి. ఇందులో కథలు, కవితలు, అనువాద కథలు, కాలమ్స్, సంగీత సాగరి, బాలలవనం, హలో డాక్టర్ లాంటి శీర్షికలున్నాయి. ఈ పత్రికకు లక్ష్మి రాయవరపు సారధ్యం వహిస్తున్నారు.

**హాస్యానందం.కామ్** (Hasyanandam.com) : గత రెండు దశాబ్దాలుగా ప్రింట్ పత్రికగా పాఠకులను అలరిస్తున్న హాస్యానందం మాసపత్రిక 2021 నుండి హాస్యానందం.కామ్ వెబ్ పత్రికగా కూడా వస్తుంది. రాము సంపాదకుడిగా వెలువడుతున్న ఈ పత్రికలో కార్టూన్లతో కథలు, శీర్షికలు అన్నీ హాస్యప్రదానంగా ఉంటాయి.

**సినీవాలి.కామ్** (Cineevaali.com) : ప్రముఖ రచయిత ప్రభాకర్ జైనీ చీఫ్ ఎడిటర్‌గా 2021సం॥లో వారపత్రికగా ప్రారంభమై, ప్రస్తుతం మాసపత్రికగా మార్పుచెందింది. ఈ పత్రికలో నాలుగు ధారావాహికలతో పాటు కొన్ని కథలు ఉంటాయి.

**తెలుగు జ్యోతి** (tfasnj.org) : తెలుగు ఫైన్ ఆర్ట్స్ సొసైటీ, తెలుగు కళా సమితి ఆధ్వర్యంలో ఊటుకూరి విజ్ఞానకుమార్ సంపాదకత్వంలో కథలు, వ్యాసాలు, మరికొన్ని శీర్షికలతో 2009 సం॥ నుండి వెలువడుతున్న ద్వైమాసిక వెబ్ పత్రిక తెలుగు జ్యోతి.

**సిలికానాంధ్ర సృజనరంజని** (Srujanaranjani. siliconandhra.org) : టి. మృత్యుంజయుడు ప్రధాన సంపాదకుడిగా మార్చి 2017 నుండి వెలువడుతున్న సిలికానాంధ్ర సృజనరంజని అంతర్జాతీయ సాహితీ పొదరిల్లు లో కథాభారతి, కవితా స్రవంతి, పద్యం-హృద్యం, ధారావాహికలు, మనబడి వంటి అనేక శీర్షికలు న్నాయి. అయితే గత కొంతకాలంగా కొత్త సంచికలను ప్రచురించడంలేదు.

**'సిరిమల్లె.కామ్"** (Sirimalle.com) : ప్రతి ఒక్కరిలోనూ మాతృ భాషపై అత్యంత మమకారం ఏర్పరిచి తదనుగుణంగా తేనెలొలుకు తెలుగులో మనందరం ఆప్యాయంగా పలకరించుకొని, సంభాషించుకునే విధంగా చేయాలన్న లక్ష్యంతో మధు బుడమగుంట, ఉమ బుడమగుంట సోదరీమణులు 2017 లో ప్రారంభించిన 'సిరిమల్లె' తెలుగు భాషా సౌరభం మాసపత్రిక. ఇందులో కథలు, నాటికలు, వ్యాసాలు, విశ్లేషణలు ఉంటాయి.

**చినవీరభద్రుడు.ఇన్** (Chinaveerabadrudu.in) : విద్యాశాఖ సంచాలకులుగా, గిరిజనసంక్షేమశాఖ సంచాలకులుగా పనిచేసి 2022లో పదవీవిరమణ చేసి, ప్రస్తుతం హైదరాబాదులో నివాసముంటున్న వాడ్రేవు చినవీరభద్రుడు వ్యక్తిగతంగా రాసుకోవడానికి ప్రారంభించిన బ్లాగు "నా కుటీరం". ఆయన ఇప్పటి దాకా దాదాపు 45 గ్రంథాలు వెలువరించారు. ఆయన కవితలు, రచనలు, ప్రసంగాలు, పుస్తక సమీక్షలు, పాల్గొనే సమావేశాల వివరాలు ఈ బ్లాగులో ఎప్పటికప్పుడు చదవవచ్చు.

## 2. ఫేస్‌బుక్ / వికీపీడియా

భావ ప్రకటనా స్వేచ్ఛకు చక్కని వేదిక ఫేస్‌బుక్. కవిత్వం, కథలు మాత్రమే కాదు, సమకాలీన సంఘటనలపై సద్విమర్శలు, ప్రశ్నలు ఉంటాయి ఇక్కడ. అప్పుడప్పుడు ఇవి శృతి మించుతుంటాయి కూడా. ఇక్కడ ఏది రాసినా దానికి ఎడిటర్, పబ్లిషర్ మనమే కాబట్టి, బాధ్యులం కూడా మనమే. అందుకే వివేకంతో వ్యవహరించాలి... లేకపోతే ఇబ్బందులు తప్పవు.

ఫేస్‌బుక్‌లో కవిత్వం రాస్తున్న వారిలో భవాని పేరిచర్ల, పత్తిపాక మోహన్. మెర్సీ మార్గెట్, బండ్ల మాధవరావు, అనిల్ డ్యానీ, కిలపర్తి దాలినాయుడు, ప్రజాకవి జయరాజ్, విల్సన్‌రావు కొమ్మవరపు, నీరజాచంద్ర, ఆకుల సుదర్శన్, మౌనశ్రీ మల్లిక్, దార్ల వెంకటేశ్వరరావు, కవితా చక్ర, పెరుగు రామకృష్ణ, అఫ్సర్, కవి యాకూబ్, లక్ష్మీ కందిమళ్ళ, వసుధారాణి, కుప్పిలి పద్మ, జ్యోతి వలబోజు, కుంచెశ్రీ, ఉమా నూతక్కి, చలపాక ప్రకాష్, సింగంపల్లి అశోక్ కుమార్, మంజు యనమదల ఉన్నారు. కథలు రాస్తున్న వారిలో మహ్మద్ ఖదీర్‌బాబు, వేంపల్లి షరీఫ్, పద్మాకర్ దగ్గుమాటి, కల్పనా రెంటాల... వ్యాసాలు, విమర్శలు రాసేవారిలో వింజమూరి వెంకట అప్పారావు, నాగసూరి వేణుగోపాల్, అబ్దుల్ రజావుద్దీన్, సుధామ, వాడ్రేవు సుందరరావు, లక్ష్మీనరసయ్య గుంటూరు, బెందాళం కృష్ణారావు, సయ్యద్ నజీర్ అహ్మద్, శ్రీధర్‌బాబు పసునూరు, సినీ డైరెక్టర్ వంశీ, అనిల్ అట్లూరి, పులికొండ సుబ్బాచారి, భరద్వాజ, మహమ్మద్ రఫీ, వాడ్రేవు చినవీరభద్రుడు, మహమ్మద్ గౌస్, మాడభూషి శ్రీధర్‌లు వున్నారు. ఇంకా మన ఆరోగ్యం-ఆహారం గురించి డా॥ జి.వి.పూర్ణచంద్, మీడియాలో తెలుగుభాషా దోషాల గురించి సనీల్ సత్తి నిత్యం మనల్ని పలకరిస్తుంటారు ఫేస్‌బుక్‌లో.

అలాగే తెలుగు వికీపీడియాలో వివిధ రంగాలకు చెందిన వ్యక్తుల జీవిత చరిత్రలు, సినిమాలు, చారిత్రక ప్రదేశాలు గురించి ఎందరో రచయితలు వ్యాసాలు రాస్తున్నారు. వారిలో రవిచంద్ర, పవన్ సంతోష్, కళాసాగర్ యల్లపు, కె. వెంకటరమణ, జయంత్ కుమార్, శశి, రాజశేఖర్, మురళీ మోహన్, చంద్రకాంతరావు, వి.ప్రణయరాజ్, రహ్మానుద్దీన్, యర్రా రామారావు, యం. ప్రదీప్, టి. సుజాత, రవి వైజాసత్య వున్నారు. వికీపీడియాలో రాయాలంటే మెంబర్ కావాల్సివుంటుంది.

## 3. యూట్యూబ్

యూట్యూబ్ (YOUTUBE) అనేది అంతర్జాలంలో వీడియోలను ఇతరులతో పంచుకోవడానికి వీలుకల్పించే ఒక అంతర్జాతీయ వేదిక. నేడు ట్రెండింగ్‌లో వున్న డిజిటల్ మీడియాలో Youtube దే అగ్రస్థానం. తమ భాషాభిమానాన్ని, పాండితీ ప్రతిభను నలుగురికి పంచాలన్న ఆలోచనతో వీడియోలుగా రూపొందించి తెలుగు భాషాభివృద్ధికి, వ్యాప్తికి కృషిచేస్తున్న వారి గురించి తెలుసుకుందాం.

**పద్య పరిమళం**: తెలంగాణాలో దుబ్బాక మండలంలోని రాజకపేటకు చెందిన పాతూరి కొండలొరెడ్డి ఎం.ఏ. తెలుగు చదువుకున్నారు. ఉపాధ్యాయ వృత్తిలోవున్న కొండలొరెడ్డిగారు తెలుగు పద్య సంపదను నేటితరానికి అందించాలన్న సంకల్పంతో పద్య పరిమళం ఛానల్‌ను 2015 సం॥లో ప్రారంభించారు. ప్రాచీన, ఆధునిక కవుల పద్యాలను రాగయుక్తంగా ఆలపించడమే కాకుండా తేటతెలుగులో పద్య భావాన్ని వివరిస్తారు కొండలొరెడ్డి.

**శ్రీకొప్పవరపు కవుల కళాపీఠం** (Sri Kopparapu Kavula Kalaapeetham): తెలుగులో జంట అవధాన కవులుగా పేరొందిన కొప్పవరపు కవుల ప్రతిభను నేటి తరానికి తెలియజేయాలని ఈ ఛానల్ ప్రారంభించారు వారి మనుమడు 'మా శర్మ' గారు. శర్మగారు గత మూడు దశాబ్దాలుగా పలు పత్రికలో జర్నలిస్టుగా పనిచేస్తున్నారు. 2002 సం॥లో శ్రీకొప్పవరపు కవుల కళాపీఠం స్థాపించి, ప్రతి సంవత్సరం సాహితీ- సాంస్కృతిక రంగాలలో నిష్ణాతులైన వారికి కళాపీఠం తరపున ప్రతిభా పురస్కారం అందజేస్తున్నారు. ఇందులో తెలుగు సాహితీ రంగంలో ప్రభవిస్తున్న నేటి కవులు కొప్పవరపు

కవులు కవితా పాండిత్యం గురించి పలువురు చేసిన ప్రసంగాలు, అవధాన, సాహితీ కార్యక్రమాల వీడియోలు ఉంటాయి.

**అజగవ** (AJAGAVA)**: "అజగవ"** అంటే అక్షరాన్ని పుట్టించిన వాడైన ఆ పరమశివుని ధనస్సు పేరు. కాశీ మజిలీ కథలు, తెనాలి రామకృష్ణ కథలు, పురాణ కథలు, జానపద కథలువంటి కథా సాహిత్యం, మల్లాది, పింగళి, కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, కరుణశ్రీ, దాశరథి, ఆరుద్ర, ఆత్రేయ, వేటూరి వంటి ఉద్దండ కవుల సాహిత్య విశేషాలు, ఇంకా, సాహిత్యంలో సరదా పద్యాలు, చాటు పద్యాలు, విశ్వనాథ వారి "మిహిరకులుడు", పింగళి నాగేంద్రరావుగారి "జేబు న్నీసా" వంటి వన్నెకెక్కిన పుస్తకాల పరిచయాలు, ఆదిశంకరులు, కాళిదాసు వంటి ప్రాచీన మహాకవుల కవిత్వ పరిచయాలు, ఇంకా, మన భాషాసాహిత్యాలపై ఆసక్తి కలిగించే మరెన్నో అంశాలు, **"అజగవ"** సాహితీ ఛానల్‌లో మన కోసం అందిస్తున్నారు గోదావరి తీరంకు చెందిన రాజన్ పి.టి.ఎస్.కె.

**అవధాన సరస్వతి పీఠం** (Avadhana Saraswathi Peetham) : ద్విసహస్రావధాని డా. మాడుగుల నాగఫణి శర్మగారు అవధాన కవితా పద్యపఠనం, ఆయన స్థాపించిన అవధాన సరస్వతి పీఠం యొక్క కార్యక్రమాల గురించి ఈ ఛానల్‌లో చూడొచ్చు. ఆధునిక కాలంలో డా. మాడుగుల నాగఫణిశర్మ ఈ అరుదైన అవధాన కళను పునరుద్ధరించి, తన అసాధారణమైన జ్ఞాపకశక్తితో పద్యాలను కంపోజ్ చేయడం, శ్రావ్యంగా ఆలపించడంతో సాహితీ ప్రియులను అలరిస్తున్నారు. తన జ్ఞాన సామర్థ్యాలతో, పాండిత్యంతో మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు వంటి సుప్రసిద్ధ వ్యక్తుల మనసు గెలుచుకున్న ద్విసహస్రావధాని నాగఫణి శర్మ. సాహిత్యం, కవిత్వం, సంగీతం, చమత్కారం మరియు హాస్యం తో తన అసమాన పాండిత్య ప్రతిభకు చక్కని వేదికగా ఈ ఛానల్‌ను రూపొందించారు.

**ఇన్ఫోబెల్స్–తెలుగు** (INFOBELLS - Telugu): "చిట్టి చిలకమ్మా అమ్మ కొట్టిందా? తోట కెళ్ళావా..పండు తెచ్చావా!" ఈ బాలలగీతం అనాది నుండి పాడుకొంటున్నదే. నేడు యూట్యూబ్‌లో ఈ పాట వందకోట్ల వీక్షణలు సొంతం చేసుకుంది. 'మా ఇంటిలోన ఒక పాప ఉన్నది... ఎత్తుకోకపోతే మరి కోపమొస్తుంది! పాట కూడా వందకోట్ల వ్యూస్ కలిగివుంది. ఇదే కాకుండా మనం మరచి పోయిన 'వానావాన వల్లప్పా', 'చల్‌చల్ గుర్రం' వంటి అచ్చ తెలుగు పిల్లల పాటలూ, కథల్ని అద్భుతమైన 3డి యానిమేషన్‌తో నేటి తరానికందిస్తుంది ఇన్ ఫొబెల్ సంస్థ. బెంగలూరుకు చెందిన జయ లక్ష్మి ఇన్ ఫొబెల్ సంస్థకు క్రియేటివ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.

**చందమామ కథలు** (Chandamama Kathalu) : పిల్లల తెలుగు నీతి కథలు '**చందమామ కథలు**' ఛానల్‌లో లభ్యమవుతాయి. తెలుగులో పిల్లల పాటలు, అద్భుత కథలు, నిద్రవేళ కథలు, అమ్మమ్మ కథలు మొదలైనవి. చిలుకను కాపాడిన దెయ్యం, కొత్త కోడలి కష్టాలు, తెల్ల ఏనుగు, గాలిలో ఎగిరే గుర్రం లాంటి... మరెన్నో ప్రసిద్ధ తెలుగు నీతి కథలు ఇందులో ఉన్నాయి. కథలన్నీ 2D యానిమేషన్ గ్రాఫిక్స్ ద్వారా పిల్లలను ఆకట్టుకునే విధంగా రూపొందించారు.

**బొమ్మరిల్లు** (Bommarillu): పిల్లలకు అత్యంత ప్రజాదరణ పొందిన తెలుగు నర్సరీ రైమ్స్, పిల్లల తెలుగు నీతికథలు **బొమ్మరిల్లు ఛానల్‌లో** లభ్యమవుతాయి. తెలుగులో పిల్లల పాటలు, అద్భుత కథలు, నిద్రవేళ కథలు, అమ్మమ్మ కథలు మొదలైనవి. కాకి ఉపాయం, రెండు కుండల కథ, బంగారు బాతు గుడ్లు మరియు మరెన్నో ప్రసిద్ధ తెలుగు నీతి కథలు ఇందులో ఉన్నాయి. ఈ కథలు పిల్లలకు ఆసక్తికరంగా వుండేందుకు చక్కని బొమ్మలతో యానిమేషన్ ద్వారా రూపొందించబడ్డాయి. కం ప్రింట్ కంపెనీ వారు ఈ ఛానల్ నిర్వహిస్తున్నారు.

**స్వాతి పంతుల** (Swathi Panthula): తెలుగు సాహిత్యంలో ఈ శతాబ్దంలో వచ్చిన ఆణిముత్యాల వంటి మూడువందలకు పైగా కథలను స్వాతి పంతుల యూట్యూబ్ శ్రోతలకు అందిస్తు న్నారు. ఇందులో మాగోఖలే-బల్లకట్టు పాపయ్య, దాశరథి రంగా చార్య-తామరపూలు, కారా మాష్టారు-తీర్పు, భమిడిపాటి జగన్నాథ రావు - దాహం, చలం-ఓ పువ్వు పూసింది, పి. సత్యవతి-నేనొస్తు న్నాను, రావిశాస్త్రి-మాయ, రావూరి భరద్వాజ- ఒక ఎలుక కథ, ద్వివేదుల విశాలాక్షి-వీలునామా లాంటి ఏన్నో కథలను తన ఆర్ద్రమైన గొంతులో కథలోని సన్నివేశాలను, పాత్రలను కళ్ళ ముందు కదలాడేలా వినిపిస్తారు స్వాతి.

**స్టోరీ టైం తెలుగు** (Bommarillu) : పిల్లల తెలుగు నీతి కథలు '**స్టోరీ టైం తెలుగు**' ఛానల్‌లో లభ్యమవుతాయి. ఇందులో కథలన్నీ 2D యానిమేషన్ గ్రాఫిక్స్ ద్వారా పిల్లలను ఆకట్టుకునే విధంగా రూపొందించారు. తెలివైన కోడలు, అక్క చెల్లెలు, ముగ్గురు కూతుర్లు, మాయ మామిడి పండు లాంటి వందకు పైగా నీతి కథలు చూడవచ్చు.

## 4. వాట్స్‌యాప్/టెలీగ్రామ్

ఇక వాట్స్‌యూప్, టెలీగ్రామ్ యాప్‌ల ద్వారా పంపిణీ కాబడే సాహిత్యం అంతా వేరే వాళ్ళు రాసినదిగాని, వివిధ పత్రికల్లో ప్రచు రించబడిన కథలు, కవితలు, వ్యాసాలు, పుస్తకసమీక్షలే ఎక్కువ. ఇందులో కొన్ని గ్రూపులు కూడా ఉంటాయి. ఉదా: పుస్తక ప్రియుల సంఘం, అమరావతి సాహితీ మిత్రులు, తెలుగు సాహిత్యం లాంటివి. ఇందులో కొన్ని పుస్తకాల, పత్రికల పి.డి.ఎఫ్.లు కూడా పంపిణీ చేయబడతాయి. స్మార్ట్‌ఫోన్లలో యూనికోడ్ టైపింగ్ సదుపాయం వచ్చాక కవులు, రచయితలు, జర్నలిస్టులు తమ రచనలను వాట్స్‌యూప్‌లో టైపింగ్‌చేసి పంపిస్తున్నారు.

ఈ విధంగా పుస్తకం చేతపట్టకపోయినా కంప్యూటర్/స్మార్ట్ ఫోన్ల ద్వారా నిత్యం మాతృభాషను చదవడం, వినడం, రాయడం చేస్తూ మన భాష ఔన్నత్యాన్ని చాటుదాం. ఈ వ్యాసంలో ప్రస్తావిం చిన వారే కాకుండా ఇంకా ఎంతోమంది వివిధ మాధ్యమాల ద్వారా భాషా వ్యాప్తికి కృషిచేస్తున్నారు. వారందరికీ వందనాలు. సాహితీ మిత్రులందరూ కూడా సోషల్ మీడియాలో విరివిగా తెలుగులో రాయాలని కోరుకుంటున్నాను.